క్లుప్తంగా

నిబంధనల మేరకు పరిహారం


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు రూరల్: గుంతకల్లు – గుంటూరు డబ్లింగ్ రైలు మార్గం కోసం భూముల కోల్పోయిన రైతులకు నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని ఆర్డీఓ రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఆర్డీఓ తన కార్యాలయంలో కసాపురం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు భూములు అప్పగిస్తామంటూ అంగీకార పత్రాలను అధికారులకు అందజేశారు. పూర్తిస్థాయి నివేదికలను కలెక్టర్‌కు పంపి త్వరలోనే రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ అయ్యేలా చూస్తామని ఆర్డీఓ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రాము, సర్వేయర్ మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు


వైద్య పరీక్షలకు హాజరైన వృద్ధులు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్ ఆర్వీ స్వామి కల్యాణ మండపంలో శనివారం బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి, తాడిపత్రి వాసవీక్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా 430 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి 235 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్ర శేఖర్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ భూమా సూర్యనారాయణ, టీసీసీ చైర్మన్ బండారు శివకుమార్, రిజియన్ సెక్రటరీ శ్యాం ప్రసాద్, సభ్యులు పెద్దమద్దిలేటి, సుబ్బరత్నయ్య, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని కొర్రపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం కొర్రపాడులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో బాలికల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ హర్ష కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం ఏమాత్రం సరికాదన్నారు. వీటి వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. బాలికలు ఆరోగ్యం శ్రద్ధ వహించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

30న రైతు సంఘం ధర్నా

తాడిపత్రి టౌన్: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30వ విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి తెలిపారు. స్థానిక నంద్యాల రోడ్డులోని రైతు సంఘం కార్యాలయంలో శనివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి అర్బన్: నందలపాడులోని రైల్వే క్రాస్ సమీపంలో మట్కా శ్రీనివాసపురానికి చెందిన ఎం.పాల మాబును సెబ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మట్కా చీటీలతో పాటు రూ. 10,720ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు నిమిత్తం పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

టైర్ పగిలి గాల్లోకి ఎగిసిన కారు


ప్రమాదానికి గురైన కారు

పెద్దవడుగూరు: టైర్ పగలడంతో కారు ఒక్కసారిగా గాల్లోకి లేచి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. శనివారం ఉదయం పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనలో తాడిపత్రి సమీపంలోని సిమెంట్ పరిశ్రమ ఉద్యోగి వీరేష్, అతని కుమారుడు బీశ్వంత్, కుమార్తె నిహారిక గాయపడ్డారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన వీరేష్ శనివారం ఉదయం తన సొంతూరుకి కుటుంబసభ్యులతో కలసి కారులో వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. భార్యకు ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ పథకాలు అందించండి



చెన్నంపల్లిలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి , 28వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ భవాని, ఆర్‌డీఓ రవీంద్ర, కమిషనర్ మల్లికార్జున

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం చెన్నంపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్ల, సచివాలయ సిబ్బంది, గృహ సారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు ప్రజలకు మరింతగా అందించేలా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 30 వరకు సచివాలయాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అందించ బోయే సేవలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. జూలై 1 నుంచి 22 వరకు సచివాలయాలు వద్ద ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రజల నుంచి అన్ని రకాల వినతులకు ప్రభుత్వం పరిష్కారం చూపిస్తుందన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ భాస్కర్, నాయకులు ఆలూరి రమణారెడ్డి, బుల్లే నారాయణస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు మిద్దె కుల్లాయప్ప, మహానందరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, ముత్యాల రంగా పాల్గొన్నారు.

పుట్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని, ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన వారికి పథకాల మంజూరు కోసం కావాల్సిన పత్రాలను అందించాలని తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బీసీకాలనీలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా 11 ధ్రువీకరణ పత్రాలను అర్హులకు అందించనున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, మ్యూటేషన్, ఖాతా నంబర్‌కు ఆధార్ అనుసంధానం, కొత్త రైస్ కార్డు, రైస్ కార్డు విభజన, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన సేవలను అర్హతలను గుర్తించి నిర్ణీత తేదీల్లో ఆయా గ్రామ సచివాలయాల ద్వారా అందజేస్తామన్నారు.

శింగనమల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ కోరారు. శనివారం శింగనమల గ్రామ సచివాలయంలో వలంటీర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి, వారికి అవసరమైన వారికి 11 ధ్రువ పత్రాలను ఉచితంగా అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, నాయకులు నవీన్‌కుమార్, శివశంకర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పేద ప్రజలకు మేలు చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, ఆర్‌డీఓ రవీంద్రలు తెలిపారు. శనివారం వారు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ఆ ఇళ్లల్లో ఉన్న వారికి ఏఏ పథకాలు అందుతున్నాయి, లబ్ధిదారులుగా అర్హత ఉండి కూడా..పథకాలు అందని వారి వివరాలను సేకరించారు. ఆయా కుటుంబాల్లో ఎవరికి ఏం అవసరమనేది తెలుసుకుని ఏం చేస్తే వారు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతారో అనే సర్వీస్ రిక్వెస్టలను రిజిస్టర్ చేసి టోకెన్ నంబర్లను ఇచ్చారు. మున్సిపల్ ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సచివాలయాల్లో ప్రజలకు ఉచితంగా అందిస్తామని ఆర్డీఓ రవీంద్ర పేర్కొన్నారు. జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ రవీంద్ర, ఎంపీడీఓ వెంకటరమణప్ప శనివారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి కసాపురంలో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి సర్వే విధానంపై వలంటీర్లకు సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించిన ఆర్డీఓ రవీంద్ర, ఎంపీడీఓ వెంకటరమణప్ప జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ రాము, కార్యదర్శి రామలింగప్ప పాల్గొన్నారు.

పామిడి: పామిడితో పాటు పలు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం సర్వే శనివారం ముమ్మరంగా సాగింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సచివాలయాల ద్వారా ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాల వివరాలను సేకరించారు. రామరాజుపల్లిలో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ డీ ప్రభాకర్ నాయక్ పర్యవేక్షించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఈసందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు.

శింగనమల: లోలూరు, ఆకులేడులో జరుగుతున్న జగనన్న సురక్ష ఇంటింటి సర్వేను శనివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి పరిశీలించారు. సర్వే పకడ్బందీగా చేయాలని ఆమె వలంటీర్లను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి రామాంజినేయులు ఉన్నారు.

యల్లనూరు: జగనన్న సురక్ష ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ వీరరాజు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూలై 1న ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమానికి ఇంటింటా తిరిగి వారికి అవసరమైన సర్టిఫికెట్లను సచివాలయం ద్వారా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

శింగనమల: శింగనమల గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు ఎస్పీ నాగమసూదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర, సచివాలయ పోలీస్ హరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట, ఎంగిలిబండ గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి శనివారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నార్పల: మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని మార్కెట్ వద్ద ప్రజలకు చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి కట్టుబడి ఉండాలన్నారు. ఇటీవల చైన్ స్నాచింగ్, దొంగతనాలు, సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


విద్యార్థులకు రాగిజావను అందజేస్తున్న ఎంఈఓ-2 ధనలక్ష్మి

యాడికి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ-2 ధనలక్ష్మి సూచించారు. శనివారం వెంగన్నపల్లె, నగరూరు ఉన్నత పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించి వారికి రాగిజావను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 మాట్లాడుతూ విద్యార్థులు జగనన్న విద్యాకానుక కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిందన్నారు. అమ్మఒడి ద్వారా ప్రతి ఏటా విద్యార్థి తల్లుల ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి పొందిన విత్తనాలే విక్రయించాలి


ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ మహబూబ్‌బాషా

యాడికి: ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలనే విక్రయించాలని ఏఓ మహబూబ్‌బాషా ఫర్టిలైజర్స్ షాపుల యజమానులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని వెంకట్, చౌడేశ్వరీ దేవి, లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 14 ఫర్టిలైజర్స్ షాపులుండగా వాటిలో 10 షాపులకు మాత్రమే విత్తనాలు అమ్మేందుకు లైసెన్స్‌లు ఉన్నాయన్నారు. దుకాణాల్లో ఎక్కువగా ధర్మా గోల్డ్, జాకీ, జయభేరీ, జననీ555, జరీ రకం పత్తి విత్తనాలను రైతులకు విక్రయించారన్నారు. రైతులకు విక్రయించిన పత్తి విత్తనాల శ్యాంపిళ్లను విశాఖపట్నం ల్యాబ్‌కు పంపించామని ఏఓ తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి


మాట్లాడుతున్న ఏపీడీ విజయకుమార్

గుత్తి రూరల్: ఉపాధి హామీ కూలీల హాజరు సంఖ్య పెంచాలని డ్వామా ఏపీడీ విజయకుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం పట్టణంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో గుత్తి క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల ఉపాధి హామీ సిబ్బంది, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఎల్ఆర్‌సీ ఆదినారాయణతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఏపీడీ మాట్లాడుతూ పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కూలీలకు రోజు పనికి తగ్గ వేతనం వచ్చేలా చూడాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా టెక్నికల్ అసిస్టెంట్లతో వేతన పంపిణీపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలి


గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

గార్లదిన్నె: మేకలు, గొర్రెలు రోగాల బారిన పడకుండా నట్టల నివారణ మందు తాపించాలని పశువైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. శనివారం మర్తాడు, గుడ్డా లపల్లి, ముంటిమడుగులో గొర్రెలు, మేకలకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల నివారణ మందు తాపించారు. ఈనెల 30 వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో గొర్రెలు, మేకలున్న వారు తప్పనిసరిగా మందు వేయించాలన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

గుంతకల్లు రూరల్: వైటీ చెరువు గ్రామంలో పొలం రస్తా వివాదంలో శనివారం జరిగిన గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి రూరల్ ఎస్ఐ సురేష్ వివరాల మేరకు..గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారులు బాలకృష్ణ, రామపుల్లయ్య పొలంలో అదే గ్రామానికి చెందిన బందెప్ప, అతడి తమ్ముడు నారాయణ స్వామి పొలాలకు పూర్వం నుంచి రస్తా ఉంది. ఈక్రమంలో బాలకృష్ణ, రామపుల్లయ్య తమ పొలంలో రస్తాను మూసివేయడంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. శనివారం గ్రామంలో రీసర్వే నడుస్తున్న సమయంలో ఇరువర్గాలు మధ్య మాటామాటా పెరిగి బందెప్ప అతడి బంధువులు కలిసి రామపుల్లయ్య, అతడి భార్య నాగమణిపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు టైం పాస్ పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: మానవత రక్తదాన ఉద్యమ సంస్థ 29వ వార్షికోత్సవం సందర్భంగా టైం పాస్ – 2 పుస్తకావిష్కరణ ఆదివారం జరగనుంది. సంస్థ కో కన్వీనర్ సలీంమాలిక్ ప్రకటనలో తెలిపారు.

స్పెషల్ సబ్ జైల్లో వైద్య శిబిరం

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైల్లో శనివారం జైలు సూపరిండెంట్ మహేశ్వరుడు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణుమూర్తి సబ్ జైల్లోని ఖైదీలకు ఎయిడ్స్, టీబీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ఖైదీలందరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పీపీఎం రాజు, టీబీ సూపర్‌వైజర్లు దేవదాస్, మన్సూర్ అలీ, జాఫర్ బాషా, ఖాజా పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

గుంతకల్లు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో అంతర్ జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏడీఆర్ఎం సుధాకర్, ఏపీఎస్‌టీఏ చైర్మెన్ నవీన్‌కుమార్, సీనియర్ డీఈఎన్ కోర్డినేషన్ అనూష (గుంటూరు) పోటీలను ప్రారంభించారు. విజేతలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏడీఎస్‌టీఏ కార్యదర్శి మేరీజ్యోతీ, రైల్వే ఇనిస్టిట్యూట్ కార్యదర్శి మల్లికార్జున ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం


పుట్లూరులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మోహన్‌కుమార్, అధికారులు

గుంతకల్లుటౌన్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని ఆర్డీఓ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం జగనన్న లేఔట్‌లో పీఎంఏవై 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు-పీఎంఏవై కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. నిలువనీడ లేని తమకు సొంతింటి కలను సాకారం చేశారని లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో సౌకర్యాల కల్పనపై అధికారులు ఆరాతీశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాము, ఎంఈ ఈశ్వరయ్య, పబ్లిక్ హెల్త్ డీఈ గురప్పయాదవ్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో హౌసింగ్ డే సందర్భంగా ఆయన మండల అధికారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సిమెంట్, బిల్లుల చెల్లింపుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, హౌసింగ్ ఏఈ లోకేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం ఆయన స్థానిక జగనన్న కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇళ్ల బిల్లులను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారులు ఏమాత్రం ఆలస్యం చేయక ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగిని స్వప్న, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి లబ్ధిదారులకు సూచించారు. శనివారం అమ్మవారిపేట గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో పర్యటించారు. జగనన్నకాలనీలో ఎంత మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు, ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హౌసింగ్ కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, డీటీ నారాయణ స్వామి, ఈఆర్‌డీ దామోదరమ్మ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎం మద్దిలేటి, ఏపీఓ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి విఠోబాస్వామి బ్రహ్మోత్సవాలు

పామిడి: ఈనెల 28 నుంచి జూలై 4 వరకూ డబ్బేదార్, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో స్థానిక విఠోబాస్వామి ఆలయంలో స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించన్నట్లు ఫిర్కాల కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో చిన్న విఠోబా దేవాలయంలో ఈనెల 28న గణపతి పూజ, అభిషేకాలు, ప్రధాన కలశస్థాపన, లక్ష్మీవ్రతం, జపాలు, హోమాలు, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 29న రుక్మిణీ పాండురంగస్వామి సమేత ఉత్సవ విగ్రహాలకు గరుడ వాహనసేవ ఉంటుందన్నారు. 30న హంస వాహనసేవ, జూలై 1న హనుమ వాహనసేవ, 2న ఐరావత వాహన సేవ, 4న వసంతోత్సవంలో భాగంగా అశ్వ వాహనసేవ, దేవతామూర్తుల నగర ప్రదర్శనతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. వచ్చేనెల 11న పామిడమ్మ దేవత హారతి కార్యక్రమం ఉంటుందన్నారు బ్రహ్మోత్సవాల్లో భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణం పరిశీలన

గుత్తి: పట్టణంలోని 20వ వార్డులో రూ. 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్ కేవీ రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వన్నూర్‌బీ మాట్లాడుతూ మున్సిపాలిటీ వ్యాప్తంగా అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళుతున్నామన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించండి


మాట్లాడుతున్న సీడీపీఓ సాజిదాబేగం

పెద్దవడుగూరు : అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని సీడీపీఓ సాజిదాబేగం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం తప్పకుండా అందించాలన్నారు. ఎవరైనా తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న బియ్యంలో పోర్టిఫైడ్ బియ్యం కలిసి ఉన్నాయని వాటిని తినడం వలన పోషకాలు ఎక్కువగా అందుతాయన్నారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

గుత్తి: పట్టణంలోని తురకపల్లి రోడ్డులో అతి విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి దర్జాగా ఆక్రమించి ఇల్లు కట్టుకున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి ఖాసీం, మండలాధ్యక్షుడు రాము, సీనియర్ నాయకులు లాలెప్ప, వీరన్న, దేవేంద్ర తదితరులు మాట్లాడుతూ తురకపల్లి రోడ్డులో ఐదు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దర్జాగా ఇల్లు నిర్మించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణ దారుడిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యుత్ భారం తగ్గించే వరకు పోరాటం

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై సర్‌చార్జ్ పేరుతో మోపుతున్న విద్యుత్ భారం తగ్గించాలని సీపీఎం, సీపీఐ పట్టణ కార్యదర్శులు భజంత్రీ శ్రీనివాసులు, గోపినాథ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్ష నాయకుల సమావేశం జరిగింది. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. నాయకులు డి.శ్రీనివాసులు, రమేష్, దాసరి శ్రీనివాసులు, రామాంజి, ఈశ్వరయ్య, రంగమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

యోగాపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

పుట్లూరు: మండలకేంద్రంలో శనివారం గర్భయోగాపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు ప్రముఖ యోగా మాస్టర్ నరేష్‌బాబు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు గర్భ యోగా విద్యను నేర్పించి వారి ద్వారా గర్భిణులకు యోగాపై అవగాహన కల్పించి ప్రసవాల సమయంలో ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.